# తండ్రి మనసు

## — ముద్దంశెట్టి హనుమంతరావు

రాత్రి పదిగంటలు దూరంలో యెక్కడో కుక్కలు అరుస్తున్నాయ్.

ఆ రోజు దినపత్రిక చదవడానికి అప్పుడు సమయం చిక్కిన వెంకటపతి శ్రద్ధగా దినపత్రిక చదువుతున్నాడు.

గడియారం పది కొట్టింది.

వెంకటపతి అప్పుడప్పుడూ వీధి ద్వారం కేసే చూస్తున్నాడు.

వెంకటపతి భార్య నిర్మల వంట గదిలో సామాన్లు చక్కబెట్టుకుని అప్పుడే వచ్చింది. చీర చెంగుతో తడి చేతులు తుడుచుకుంటూ "ఏమిటండీ, యింకా న్యూస్ పేపరు చదవడం పూర్తి కాలా?" అంది నిర్మల, భర్త పక్కనే సోఫాలో కూచుంటూ

వెంకటపతి, కళ్ళద్దాలు ఓసారి సవరించుకుని భార్యకేసి చూశాడు.

"నేనేం చదివినా, ఆషామాషీగా 'గాకుండా విపులంగా చదువుతాను నిర్మలా; ఆ విషయం నీకూ తెలును. అందుకే కాస్త సమయం పడుతుంది. ఔనూ పదయ్యింది... మందరం యింకా రాలేదేం?" అన్నాడు.

"వస్తాను లెండీ! మీరు అనవసరంగా కంగారు పడుతూ వుంటారు. వాడేం చిన్న పిల్లాడా యింక; ఇంకా మనవాడు నయం. ఈ కాలం కుర్రాళ్ళని చాలా మందిని చూస్తున్నాంగా–యింటి పట్టునే వుండరు. రాత్రి యెప్పుడు యిల్లు చేరుకుంటారో వాళ్ళకే తెలీదు" అంది నిర్మల.

నిర్మల, అలా అనడం కొత్తకాదు... వెంకటపతి యెన్నోసార్లు భార్యమాట అటువంటి సమర్థన విన్నాడు. పొడిగ నవ్వేడు.

"ఎవరో యెలాగో వున్నారని, వాళ్ళని ఉదాహరణంగా తీసుకోకూడదు నిర్మలా; ముఖ్యంగా చెడు సాంప్రదాయంలో మంచిని దృక్పధంలో పెట్టుకుని, వుదాహరణలు యెందుకు చెప్పకో కూడదూ? నేను అనవసరంగా కంగారు పడుతున్నానని అనుకుంటావుగాని, నా మనసులోని ఆరాటం నీకు అర్థం కాదు. నీకే కాదు–పిల్లలకీ అర్థం కాదు. ఇన్నేళ్ళు నాతో సహజీవనం చేసిన నీకే అర్థం గాకపోతే, పిల్లలకేం అర్థమవుతుందని?" అన్నాడు ఓ చిన్న నిట్టూర్పు విడుస్తూ.

చదవడం పూర్తయ్యాక న్యూస్ పేపర్ని మడతబెట్టి బల్లమీద పెట్టేశాడు వెంకటపతి.

తలుపు తట్టిన చప్పుడయ్యింది. "అదిగో వండీ వాడొచ్చేశాడు" అంటూ చరచరా వెళ్ళి తలుపు తెరిచింది నిర్మల.

మందరం లోపలికి వచ్చాడు. తండ్రిని చూసి మొహం దించుకుని లోపలికి వెళ్ళిపోబోయాడు.

నిర్మల తలుపు గడియ పెట్టి వచ్చింది. "ఒరేయ్ అబ్బాయ్..." మెల్లగా అన్నాడు వెంకటపతి.

మందరం గతుక్కుమన్నాడు. ఆగిపోయి వెనక్కి వచ్చాడు.

"ఏం నాన్నా!" కింది చూపులు చూస్తూ అన్నాడు.

"ఎక్కడికెళ్ళావురా? ఇంత రాత్రి వరకూ యెక్కడ తిరుగుతున్నావు?" సౌమ్యంగానే ప్రశ్నించాడు, వెంకటపతి

తండ్రి గర్జించనందుకు సంతోషించాడు మందరం.

"స్నేహితులు రమ్మని బలవంతం చేస్తే సినిమాకి వెళ్ళాను నాన్నా" మెల్లగా అన్నాడు.

"రోజూ యేదో ఒక సాకుతో యిలా తిరుగుతూనే వున్నావురా. అంతేగాని నీ భవిష్యత్తు గురించి, నీ జీవితం గురించి, యేనాడైనా ఆలోచించావ్రటా? డిగ్రీ పాసై మూడేళ్ళయింది. నీ జీవితానికి స్థిరత్వం యేర్పడలేదింక. నీ జీవిత గమ్యం గురించి ఆలోచించవేంరా?"

నిర్మల చప్పున కలిగించుకుంది.

"ఇప్పుడివన్నీ యెందుకండీ? వాడు మాత్రం వూరికే కూచున్నాడా? పరీక్షలకు వెళ్తున్నాడాయె. అదృష్టం కలిసి రాకపోతే వాడు మాత్రం యేం చేస్తాడు చెప్పండి?"

"అదృష్టం కలిసి రావాలి. నేనూ ఒప్పుకుంటాను నిర్మలా; కాని, మానవ ప్రయత్నమన్నది కూడా వుండాలి కదా, అదృష్టమంటూ చేతులు ముడుచుకొని కూర్చుంటే కలిసొస్తుందనా నీ అభిప్రాయం? మన ప్రయత్నమూ వుండాలి"

"వాడు మాత్రం పరీక్షలకి చదివి వెళ్ళడం లేదూ" అంది నిర్మల

తల్లిమాటలు ఆసరాగా, ఆలంబనగా దొరికాయి మందరంకి. ధైర్యాన్ని చిక్కబట్టుకున్నాడు. "ఔను నాన్నా! ఏ పరీక్షకి వెళ్ళినా, యెంత కష్టపడి చదువుతున్నానో మీకు తెలీదు. కాని యేం లాభం? అమ్మ అన్నట్టు అదృష్టం కలిసి రావడం లేదు" అన్నాడు మందరం.

వెంకటపతి మెల్లగా నవ్వేడు. "మీ అమ్మ తెలివి తక్కువ కొద్దీ యిలా అంటుంటే చదువుకున్న నువ్వూ, ఆమెకి వంత పాడ్డం ఆశ్చర్యంగా వుందిరా మందరం. నువ్వు పరీక్షలకి వెళ్తున్నావు కాదనను. కాని ప్రతి పరీక్షలోనూ నువ్వు తప్పుతున్నావూ అంటే నీ కృషిలో యెక్కడో లోపముందన్న మాట! పరీక్షల్లో పాసవుతున్న వాళ్ళందరూ అదృష్టం మీద ఆధారపడే పాసవుతున్నా రంటావా? లేదు అదివారి కృషి ఫలితం. నిరంతర శ్రమ ఫలం; 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నారు పెద్దలు. వూరికనే అన్నారా; శ్రమించు... యింకా శ్రమించు. ఫలితం సాధిస్తావు" అని వెంకటపతి అంటుండగానే మందరం అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

వెంకటపతి మనస్సు చివుక్కుమంది.
సుందరం యెంత నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు.

దీనికి కారణం యెవరు? వాడా? లేక వాడి తల్లా?... అన్న ప్రశ్న వెంకటపతి మస్తిష్కంలో మెదిలింది. కాని, సరైన సమాధానం దొరకలేదు. ఇప్పటితరం యువతే అంతేమో అని పించింది అతనికి. బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"వెళ్ళు నిర్మలా, వాడికి భోజనం పెట్టు" అన్నాడు వెంకటపతి.

నిర్మల వంటగదికేసి వెళ్ళిపోయింది.

వెంకటపతి లేచి వంటగదికేసి నడిచాడు. సుందరం మాటలు వినిపించాయి. అక్కడే నిశ్శబ్దంగా నుంచుని విన్నాడు.

ఏంటమ్మా నాన్న యెప్పుడూ యిలాగే మాట్లాడతారు? ఓ సరదా లేదు... పట్టుబండలూ లేవు" విసుగ్గా అన్నాడు సుందరం. "పోనీలేరా! చెప్పింది మీ నాన్నేగా ఆయన తత్వమే అంత. నువ్వేం పట్టించుకోకు. భోంచెయ్" అంది నిర్మల

వెంకటపతి మనస్సు దిగాలు పడింది. సుమారు ముప్పయేళ్ళు తనతో సంసారం సాగించిన భార్య తనని అర్థం చేసుకున్నది యింతేనా?... అనిపించింది. నిర్మల సుందరంతో అలా చెప్పకుండా తన అభిప్రాయాలకు మద్దతునిస్తూ వాడికి నచ్చచెప్పివుంటే యెంత బావుణ్ణు? అనుకుని అక్కడినుంచి వెనక్కి తిరిగి వచ్చేశాడు.

తన గదిలోకి పోయి మంచం మీద చేరబడ్డాడు.

* * *

మరునాడు

వెంకటపతి డ్యూటీ నుంచి యింటికి వచ్చేసరికి సాయంత్రం యేడు గంటలు దాటి పది నిమిషాలయ్యింది. "అమ్మాయ్ అరుణా, గ్లాసుతో మంచినీళ్ళు తీసుకురావమ్మా" అంటూ సోఫాలో కూచున్నాడు.

అరుణ రాలేదు కాని, నిర్మల గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చింది.

"మీరేమిటి యింతవరకూ రాలేదా అని యెదురు చూస్తున్నానండీ. ఈ వేళ యింత ఆలస్యమయ్యిందేమండీ" అంది నిర్మల భర్తకి నీళ్ళు అందిస్తూ

వెంకటపతి నీళ్ళు తాగేసి ఖాళీ గ్లాసు భార్యకి అందించాడు.

"అర్జంటు పనుండటం వల్ల త్వరగా రాలేక పోయాను నిర్మలా; అమ్మాయి యేదీ?"

'సినిమాకి వెళ్ళిందండీ" మెల్లగా అంది నిర్మల.

వెంకటపతి ముఖంలో రంగు మారింది

"సినిమాకా? ఎవరితో!"

"ఎదురింటి శారద, పక్కింటి శాంత, అమ్మాయి కలిసి వెళ్ళారు"

వెంకటపతి మొహం కాస్తంత యెర్ర బారింది.

"నీకు యెన్నోసార్లు చెప్పాను నిర్మలా, అమ్మాయిని చీకటి పడ్డాక యెవ్వరితోనూ పంపవద్దని. ఆ సినిమాకి తర్వాత యెప్పుడో నువ్వే తీసుకెళ్ళలేక పోయావా?" చిరుకోపంతో అన్నాడు. "ఇప్పుడు మాత్రం యేమయ్యిందండీ. ముగ్గురూ స్నేహితురాళ్ళు కలిసి వెళ్ళారు కదా. సినిమా హాలు కూడా దగ్గర్లోనే వుంది" అంది నిర్మల.

"నువ్వు ఆలోచించేది అంతే నిర్మలా; కాస్తంత ముందు చూపు వుండదు. ఈ రోజుల్లో ఆడ పిల్లలు అగుపిస్తే వాలు-కుర్రాళ్ళు యెలా టీజ్ చేస్తున్నారో మర్చి పోయావా?"

నిర్మల విసుగ్గా మొహం పెట్టింది. "అబ్బ మీతో యిదే చిక్కండీ; అమ్మాయి ఒంటరిగా వెళ్ళలేదుకదండీ. ముగ్గురు చదువుకున్న అమ్మాయిలు కలిసి వెళ్ళారు.






ఇంకా టీజ్ చేసే ధైర్యం యే మగాడికి వుంటుందీ?''

వెంకటపతి చిన్నగా నిట్టూర్చాడు. నిర్మల మొండి వాదన అతని సహనాన్ని రెచ్చగొడుతోంది. ''నీ మొండి వాదన నీదే నిర్మలా! ముగ్గురూ కలిసి వెళ్ళారని, చదువుకున్న వాళ్ళని నువ్వు ధైర్యంగా చెప్పొద్దు. ఆ ముగ్గురూ అమ్మాయిలేగా. రోజూ న్యూస్ పేపర్‌లో యెన్నో వార్తలు చదువుతున్నావు. అయినా నువ్వు విషయాన్ని అర్థం చేసుకోవడం లేదూ అంటే నీ మీద నాకు జాలివుడుతోంది నిర్మలా' అన్నాడు వెంకటపతి. భర్త మాటల్ని సీరియస్‌గా తీసుకోలేదు నిర్మల. ''ఏమీ కొంప మునిగిపోదు. మీరేం కంగారు పడకండి. వెళ్ళి స్నానం చెయ్యండి. టిఫిను చేశాను... తీసుకుని కాఫీ తాగుదురు గాని'' నిశ్చింతగా అంది.

వెంకటపతి బరువుగా ఓ నిశ్వాసం వదిలాడు. తల్లిగా నిర్మలకు యే మాత్రం బాధ్యత, భయమూ లేనందుకు యెంతో బాధపడ్డాడు. తాను తనింట్లోనే ఒంటరి వాడై పోయాడేమోనని పిస్తోంది వెంకటపతికి. వాళ్ళ మంచినే దృష్టిలో పెట్టుకుని చెబుతున్నా, అటు భార్యగాని, యిటు పిల్లలు గాని తనని అర్థం చేసుకోనందుకు లోలోన వ్యథ చెందాడు. ఈ రకం వాతావరణం తన ఒక్కడి యింట్లోనే కాదని, ఆ మధ్య తన మిత్రుడు సాంబశివరావు చెప్పిన వైనం బట్టే అర్థమయ్యిందతనికి. బాహ్యంగా తెలీకపోయినా, యిటువంటి వాళ్ళింకా దేశంలో యెంత మంది వున్నారో యెవరికి తెలుసు?... అనుకున్నాడు. సినిమాల్లోనూ, నాటకాల్లోనూ, కథల్లోనూ తల్లి మనసుకే అధిక ప్రాధాన్యత నిస్తూ వుండటం గమనిస్తున్నాడు వెంకటపతి. అందుకు అతని హృదయం అప్పుడప్పుడూ స్పందించడం కూడా కద్దు. పిల్లల విషయంలో తల్లికి యెంత బాధ్యత వుందో తండ్రికీ అంతే బాధ్యత వుందన్న నిజాన్ని వీళ్ళెందుకు గ్రహించరు. ఎక్కడో ఓ తండ్రి దుర్మార్గుడై, త్రాగుబోతై పిల్లల మంచి చెడ్డల్ని, వారి భవిష్యత్తుని పట్టించుకోని వాడిగా వుంటే వుండొచ్చు. అప్పుడు తల్లి మనసుకి ప్రాధాన్యత తప్పదు. కాని, దాన్ని జనరలైజ్ చెయ్యడంయేం బావుంది? సంసారంలో విష బిందువుల్ని చిమ్మి, సంసారాన్ని ఛిన్నాభిన్నం చేసిన మాతృమూర్తి కూడా యెక్కడో వుండొచ్చు. అదీ జనరలైజ్ చెయ్యలేం...అన్న అభిప్రాయం వెంకటపతిది.

తండ్రిగా తన బాధ్యత నిర్వహణలో పిల్లల శ్రేయస్సు -కోసమే కష్టించి ధనార్జన చేసి వాళ్ళ అభివృద్ధికి కాంక్షిస్తాడు. యే తండ్రి అయినా వాళ్ళ మంచినే కాంక్షిస్తాడు. వాళ్ళు తప్పుత్రోవన పడకుండా తీర్చి దిద్దుతాడు. వాళ్ళు యేమాత్రం మార్గం తప్పినా ఆందోళన చెందుతాడు. అటువంటి తండ్రి అనుభూతుల్ని పిల్లలు యెంతవరకు అవగాహన చేసుకుంటున్నారు... అన్న ప్రశ్న వెంకటపతిలో వుద్భవించింది.

స్నానం ముగించి వచ్చాక టిఫిన్ చేసి కాఫీ తీసుకున్నాడు వెంకటపతి.

"నిర్మలా, ఆ దినపత్రిక యిలా తీసుకురా" అన్నాడు సోఫాలో జేరబడి.

నిర్మల దినపత్రిక తెచ్చి అందించింది. దినపత్రిక చదవడంలో నిమగ్ను డయ్యాడు వెంకటపతి.

తొమ్మిదిన్నర కావస్తోంది.

ఆ రోజు సుందరం మాత్రం తొందరగానే యిల్లు చేరుకుని బుద్ధిగా చదువుకుంటున్నాడు.

అరుణ ఇంకా సినిమా నుంచి రాలేదన్న ఆరాటం వెంకటపతిని నిశ్చలంగా వుండనీయలేదు. అతని దృక్కులు ద్వారం కేసే వుంటున్నాయ్.

"నిర్మలా..."

"ఏమిటండీ?"

"సినిమా యీ పాటికి విడిచిపెట్టి వుంటారంటావా?"

"అబ్బబ్బ మీతో గొప్ప చిక్కండీ విడిచి పెట్టేస్తారు. ఇంక అమ్మాయి వచ్చేసే వేళయ్యింది కూడా. ఎందుకా కంగారు?" విసుగ్గా అంది నిర్మల.

తనకి వున్న ఆరాటం, తల్లిగా ఆమెకి యెందుకు లేదో వెంకటపతికి అర్థం కాలేదు.

భార్య విసుగు గమనించి మరేమీ అనలేక పోయాడు.

పేపరు చదవడంలో నిమగ్నుడయ్యాడు. పది నిమిషాలు గడిచింది. తలుపు తట్టిన చప్పుడయ్యింది.


నిర్మల ఉత్సాహంగా లేచింది.


"అదిగోనండి అమ్మాయి వచ్చేసింది. మీరు వూరికనే కంగారు పడిపోతా రండీ" అంటూ చరచరా వెళ్ళి తలుపు తెరిచింది.

ఎదురుగా ఆ వీధిలోనే వుంటున్న రామనాథం, అతని వెనుక అరుణ కనిపించారు నిర్మలకి. "రండి అన్నయ్యగారూ" అంటూ ఆహ్వానించింది నిర్మల.

రామనాథం లోపలకి వచ్చాడు. అరుణ బితుకు బితుకుమంటూ తల్లి వెంట వచ్చింది. కూతూరు ముఖ కవళికలు, ఆ కంగారు గమనించి ఆశ్చర్య పోయింది నిర్మల.

"ఏమయ్యిందే!" అంది మెల్లగా.




"అమ్మాయి యేం చెబుతుంది చెల్లాయ్. నేను చెబుతాగా" అంటూ వెంకటపతి పక్కనే సోఫాలో కూలబడ్డాడు రామనాథం.

వెంకటపతి అయోమయంగా చూస్తున్నాడు. ఆ సమయంలో రామనాథం యెందుకు వచ్చాడో అతని వూహకి అందలేదు.

"ఔనూ మీ అమ్మాయిని సినిమాకి ఒంటరిగా యెందుకు పంపించారు వెంకటపతీ? అదీ సాయంత్రం ఆటకి?" ప్రశ్నించాడు రామనాథం.

ఈ విషయంలో రామనాథం ఎందుకని నిలదీసినట్లు మాట్లాడుతున్నాడా అని మొహం ముడుచుకుంది నిర్మల. ఆయన్ని అడిగితే యేం చెబుతారు అనుకుంది.

"ఒంటరిగా వెళ్ళలేదు అన్నయ్యగారూ. శారద, శాంతి, అమ్మాయి కలిసి వెళ్ళారుగా!" సమాధానం చెప్పింది నిర్మల.

"ఔనమ్మా వాళ్ళూ వెళ్ళారు. అయితేనేం ముగ్గురూ అబలలే కదా. ఎవరో ఒకరైనా మగాడు లేకుండా వీళ్ళని పంపడం యేం బావుండ లేదు. ఇలా అంటు న్నానని మరోవిధంగా భావించొద్దమ్మా. రోజులు యెలా వున్నాయో తెలుసుగా?"

వెంకటపతి భార్యకేసి తీక్షణంగా చూశాడు.

నిర్మల, మొహం దించేసుకునే జవాబు చెప్పింది.

"చదువుకుంటున్న పిల్లలు కదన్నయ్యగారూ, అందుకే ధైర్యంగా వెళ్ళారు"

"పాతకాలం కాదమ్మా చెల్లాయ్; ఇప్పుడు అల్లరిమూక అధికమయ్యింది. అమ్మాయిల్ని ఆట పట్టించడమే కొందరికి ధ్యేయంగా మారిపోయింది. స్త్రీ లంటే చులకన భావం పెరిగిపోయింది యువకుల్లో. అదృష్టవశాత్తూ నేనూ అదే సినిమాకి వెళ్ళి అదే క్లాసులో అదే వరుసలో వున్నానుగాబట్టి సరి పోయింది. లేకుంటే వీళ్ళ ముగ్గుర్నీ వాళ్ళెంతగా ఆట పట్టించే వారో!"

వెంకటపతి కూతురుకేసి యెర్రగా చూశాడు.

"ఔనా అరుణా?" గద్దించాడు.

అరుణ తండ్రికేసి బితుగ్గా చూసింది. "ఔను నాన్నా, రామనాథం బాబాయ్ మేం కూచున్న వరుసలోనే వుండటం మా అదృష్టం. లేకుంటే ఆ కోతిమూకతో మేం గొడవ పడాల్సి వచ్చేది" అంది మెల్లగా.

నిర్మల మొహం వివర్ణ మయ్యింది.

వెంకటపతి భార్యవేపు చిరుకోపంతో చూశాడు.

"విన్నావా నిర్మలా మనవాడు అక్కడున్నాడు గాబట్టి సరిపోయింది. లేకపోతే అనవసరంగా వీళ్ళ ముగ్గురూ అల్లరి పాలయ్యేవారే కదా! అందుకే నేను చెబుతూ వుంటాను. అలా అమ్మాయిని పంపించొద్దని. కాని నువ్వు వింటేగా? పైగా నన్ను అపార్థం చేసుకుంటారు" అన్నాడు విసురుగా.

నిర్మల యేం సమాధానం చెబుతుందని? అవాక్కయి పోయింది.

"ఏదో జరిగేందేదో జరిగిపోయింది. ఇంకెప్పుడూ యిలా వెళ్ళొద్దమ్మా అరుణా. మీ అమ్మా, నాన్నా వెళ్ళినప్పుడే వెళ్ళు. లేదా స్త్రీలలోకి వెళ్ళు. మనం ఆశించినంత మార్పు సంఘంలో రాలేదమ్మా యింక... మరి వెళ్ళొస్తానా పతీ" అంటూ లేచాడు రామనాథం.

"థాంక్స్‌రా నాథం..." కృతజ్ఞత చెప్పుకున్నాడు వెంకటపతి.

"దానికేం లేరా నవ్వి..." అనేసి వెళ్ళిపోయాడు రామనాథం. అప్పుడే అక్కడికి వచ్చాడు సుందరం.

"ఏమయ్యిందమ్మా" ప్రశ్నించాడు.

వెంకటపతి కోపంగా వున్నాడో— "చెప్పు నిర్మలా" అన్నాడు.


"మీ చెల్లాయి, శారద, శాంతి కలిసి సినిమాకి వెళ్ళారని చెప్పాను కదురా. వీళ్ళ ముగ్గుర్నీ ఆట పట్టించారట కొందరు వెధవలు. సమయానికి రామనాథం బాబాయ్ అదే నరునలో వుండటం మంచిదయ్యింది. ఆయన వీళ్ళ ముగ్గుర్నీ యిళ్ళకు తీసుకొచ్చారు." చెప్పింది నిర్మల.

"అయినా చెల్లాయిని యెందుకలా పంపావమ్మా? మనందరం వెళ్ళినపుడే తీసుకుపోతే కదూ? లేకుంటే నువ్వు వెళ్ళినపుడయినా ఆడవాళ్ళ క్లాసుకి తీసుకుపోతే పోయేది. అదీకాకపోతే మేట్నీకి వెళ్తే బావుండేదిగా. ఇప్పుడేమంత తొందరొచ్చిందని పంపావు?" సాధారణంగా తల్లికి వంతపాడే సుందరం ఆమెకి వ్యతిరేకి అయ్యాడీ విషయంలో.

వెంకటపతికి యిప్పుడు గొప్ప సదవకాశం దొరికింది. తన మనసులో రగులుతున్న ఆవేదనని వ్యక్తీకరించాలనుకున్నాడు.

"ఒరేయ్ అబ్బాయ్, యిప్పుడేదో యిబ్బంది యెదురయ్యింది గాబట్టి అందరం యేమేమో అనుకుంటున్నాం. ఇదే విషయాన్ని మీ అమ్మతో యెప్పుడూ చెబుతూనే వున్నాను. కాని, నా మాట యెవరు వింటున్నారని? మొన్నను నువ్వు ఆలస్యంగా యింటికొస్తే నేను కలిగించుకొని నీ శ్రేయస్సు కోరియేమో అన్నానని నీకు కోపం వచ్చింది. పరోక్షంగా నన్ను యేవగించుకున్నావు. నీకు వత్తాసు పాడింది మీ అమ్మ మీ చెల్లాయి విషయంలోనూ. గతంలో యెన్నో సందర్భాల్లో యిలా జరిగింది. మీ అమ్మేమో మిమ్మల్ని సమర్థించి లేదా నాకు వ్యతిరేకంగా మాట్లాడి మీ అభిమానాన్ని సంపాదిస్తోంది. అక్కడికి నేనే ఒంటరివాడిని అవుతున్నాను. కాని వివేకంతో ఆలోచిస్తే నేను చేసిన తప్పేమిటి? నేనం చెప్పినా మీ మంచిని కాంక్షించే చెబుతున్నారు. మీ అభివృద్ధిని కోరి చెబుతున్నారు. దాన్ని మీరు అపార్థం చేసుకొని నన్నో విరోధిలా లోలోన సృష్టించుకుంటే నేనేం చేసేది? నా సహృదయాన్నీ, నా శ్రేయోభిలాషిత్వాన్ని యెందుకు గుర్తించరు? తండ్రిగా నాకూ ఓ మనసుంది. అది మీ మంచిని కాంక్షిస్తుందని, మీకు యెటువంటి కష్టం కలిగినా ఆక్రోశిస్తుందని, యెందుకు గ్రహించరు" అంటూ క్షణం ఆగాడు వెంకటపతి. అతని గొంతు కాస్తంత జీరవోయింది.

ఆ క్షణం, ఆ గదిలో వాతావరణం నిశ్శబ్దంగా వుంది. ఎవరూ మాట్లాడ్డానికి సాహసించలేక పోయారు. వెంకటపతి మాటలు అక్కడున్న వారిని బాగా ప్రభావితం చేసినట్టుంది. మళ్ళీ ప్రారంభించాడు.



దీపాల ముగ్గు

కె. పద్మజ

"దీనికి బాధ్యులు యెవరో తెలుసునా?" అక్కడున్న ముగ్గురికేసి చూశాడు వెంకటపతి.

వాళ్ళు ముగ్గురూ ఆసక్తిగా చెవులు రిక్కరించుకుని సమాధానం కోసం యెదురు చూస్తున్నారు. "మీకు తెలీదు. కాదు-మీరు తెలుసుకోలేక పోతున్నారు. మీరు తప్పుచేస్తున్నా ఆ తప్పుల్ని నేను యెత్తి చూపుతూ సరి దిద్దాలని ప్రయత్నిస్తున్నా, నా మాటలకు చేయూత నివ్వకుండా మీ తప్పుల్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నం చేస్తూ మీ అభిమానాన్ని చూరగొంటున్న మీ అమ్మే ప్రథమంగా బాధ్యురాలు; కాదంటారా? నిజాన్ని అవగాహన చేసుకోకుండా మీ భవితవ్యం కోసం నేను పడే శ్రమల్ని గుర్తించకుండా నా మనసులోని వాత్సల్యాన్ని చదవకుండా నా పట్ల ఓ విధమైన యేహ్యభావాన్ని పరోక్షంగా పెంచుకున్న మీరు బాధ్యులు కారా? చెప్పండి. ఏరా సుందరం? ఏనమ్మా అరుణా! చెప్పండి నన్ను సరిగ్గా అర్థం చేసుకుంటున్నారా? కేవలం తల్లికే కాదు-తండ్రికీ ఓ మనసుందని గ్రహించండి. పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా వుండాలని, వాళ్ళు సుఖమయ జీవితం సాగించాలని, సదా కాంక్షించే తండ్రి మనసు, యెందులోనూ తల్లి మనసుకి తీసిపోదు. ఈ నిజాన్ని మీరే కాదు-అందరూ అవగతం చేసుకోవాలి" అన్నాడు వెంకటపతి.

అతని మొహంలో యెంతో రిలీఫ్ అగుపించింది. మనసులో దాక్కొన్న బరువు అంతా దించేసుకున్నట్టయ్యిందతనికి.

సుందరం, అరుణ మొహాలు దించేసుకున్నారు. తండ్రి చెప్పింది అక్షరాలా నిజమనిపించింది. కాని, యిన్నాళ్ళు ఆయన మాటల్ని పెడచెవిన పెట్టి ఆయన్ని యేహ్యభావంతో చూసి ఒక విధమైన అపోహను సృష్టించుకున్నారు. అది నిశ్చయంగా తమ తెలివి తక్కువ తనమేనని పించింది. అందుకు తల్లిని బాధ్యురాలిగా భావించారు.

నిర్మల పరిస్థితిని అర్థం చేసుకుంది కొంతమేరకు, పిల్లలు తండ్రిపట్ల అపోహను పెంచుకోవడానికి తనే కారణమనుకుంది. తనలో యెటువంటి స్వార్థమూ లేకపోయినా అప్రయత్నంగా యీ పరిణామాలు చోటు చేసుకున్నాయి. పశ్చాత్తాపంతో ఆమె హృదయం ప్రక్షాళితమయ్యింది.

"క్షమించండీ మీరన్నట్టు యీ పరిణామాలకు నేనే బాధ్యురాల్ని. కాని యిది తెలిసి చేసిన పొరపాటు కాదు . యాదృచ్ఛికంగా జరిగిన పొరపాటు. మీరన్నట్టు తండ్రి మనసు, తల్లి మనసుకి యెందునా తీసిపోదు. ఇకముందు యిటువంటి పొర పాటు జరగకుండా జాగ్రత్త వహిస్తానండీ" అంది నిర్మల. "మమ్మల్నీ క్షమించండి నాన్నా! మీ మనస్సుని అర్థం చేసుకోలేక పోయాం. ఇప్పుడు మాలోని అపోహ మటుమాయమయ్యింది" అన్నారు-సుందరం, అరుణ ముక్త కంఠంతో.

వెంకటపతి తృప్తిగా నవ్వుకున్నాడు. అతని మనసు తేలిక పడింది. మొహం వికసించింది.

